అడుగు జాడలు

● కొల్లాపూర్ నల్లమలలో సంచరిస్తున్న పెద్ద పులులు

» పెగ్గర్లపెంట అడవిలో 3 పెద్ద పులుల జాడలు గుర్తించిన అటవీ అధికారులు

» సీసీ కెమెరాల నిఘాలో బయటపడ్డ పెద్ద పులుల చిత్రాలు



ఈనెల 16వ తేదీన కొల్లాపూర్ నల్లమల పెగ్గర్లపెంట ప్రాంతంలో సంచరిస్తున్న పెద్దపులి



పెద్దపులి అడుగు జాడలు గుర్తించిన అధికారులు

కొల్లాపూర్ , జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో దట్టమైన అడవులకు, లోతైన లోయలకు ప్రసిద్ధిగాంచిన అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులో కొల్లాపూర్ నల్లమలకు ప్రత్యేక స్థానం ఉంది. పెద్ద పులులు, చిరుతలు, వివిధ జాతుల వన్యప్రాణులు, పక్షులు వివిధ రకాల జంతువులు ఉన్న విషయం తెలిసిందే. కొల్లాపూర్ మండల పరిధిలోని ముక్కిడిగుండం నుంచి సరిగ్గా 20 కిలో మీటర్ల మేర దట్టమైన నల్లమల ప్రాంతమైన పెగ్గర్ల పెంటలో అట వీ అధికారులు పెద్ద పులులు సంచరించిన జాడలను గుర్తించారు. నల్లమలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీని అటవీ శాఖ అధికారులు పరిశీలిస్తే.. ఈనెల 16వ తేదీన పెగ్గర్ల పెంట నల్లమలలో మూడు పెద్ద పులులు సంచరిం చినట్లు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన అధికారులు అనుమతి లేనిదే నల్లమలలోకి ఎవరూ వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు. రైతులు మూగజీవాల మేత కోసం దట్టమైన అడవుల్లోకి ప్రవేశించకుండా బహి రంగ ప్రదేశాలలోనే వాటికి అందించాలని ఆంక్షలు విధించారు. కొల్లాపూర్ నల్లమల టైగర్ రిజర్వ్ ఫారె స్టులో ఐదు నుంచి ఏడు పెద్ద పులు లు సంచరి స్తున్నాయని, వాటితో పాటు రెండు చిన్న పిల్ల పులులు కూడా ఉన్నట్లు వెల్లడించారు.

ప్రత్యేక నిఘా ఉంచాం



జూలై నుంచి సెప్టెంబర్ వరకు దట్టమైన అడవుల్లో పెద్ద పులులు, వన్య ప్రాణులు, వివిధ రకాల జీవాలు సంతానోత్పత్తి చేసే కాలంగా పరిగణించి నల్లమలలోకి ఎవరిని వెళ్లకుండా ఆంక్షలు విధించాం. జిల్లా అటవీ శాఖ అధికారి డీఎఫ్‌వో రోహిత్ గోపిడి ఆదేశానుసారం హెచ్చరికలు జారీ చేశాం. నల్లమలలో అక్రమ కలప రవాణా జరగకుండా అటవీ శాఖ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నాం.

-ఎండీ ముజీబ్ గోరి, ఫారెస్టు సెక్షన్ అధికారి

● సెప్టెంబర్ వరకు పెద్ద పులులు జతకట్టే సమయం

నల్లమల ప్రాంతంలో కోర్ ఏరియాలో జూలై నుంచి సెప్టెంబర్ ఈ మూడు నెలల పాటు పెద్ద పులులు జత కట్టే కాలం అని అధికారులు తెలుపు తున్నారు. అడవిలో వర్షాలు కురిసి చెట్ల గడ్డి వి స్తారంగా పెరగడంతో ప్రశాంతమైన వాతావరణం లో పెద్ద పులులు, ఇతర వన్య ప్రాణులు జతకట్టి సంతానోత్పత్తి జరుపుతాయి. ఈ సమయంలో అడ వుల్లో జన సంచారం ఉంటే పులుల ఏకాంతానికి భంగం కలిగి సంతానోత్పత్తిపై ప్రభావం చూపు తుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని అటవీ అధికారు లు పెద్ద పులుల యొక్క అడుగు జాడల ప్రకారం ఎన్ని పులులు ఉన్నాయో అని జంతువుల కద లికలను ఈ నెలలోనే సీసీ కెమెరాల ద్వారా, దాని యొక్క పాద ముద్రల ద్వారా గుర్తి స్తున్నారు. పెద్ద పులులు మగ లేక ఆడవా అని అటవీ అధికారులు నిరంతరం నల్లమలలో పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.



కొల్లాపూర్ నల్లమల టైగర్ రిజర్వ్ ఫారెస్టులో పెద్ద పులి జాడలను గుర్తిస్తున్న అటవీ అధికారులు

అప్రమత్తంగా ఉంటే

వ్యాధులు దరిచేరవు

» జ్వరం వస్తే వైద్యులను సంప్రదించాలి

» 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌లో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సిద్దప్ప



ఆంధ్రజ్యోతి ఫోన్-ఇన్

గద్వాల న్యూటౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే రోగాలు దరిచేరవని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సిద్దప్ప అన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు అయిన మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికున్‌గున్యా తదితర వాటిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వోతో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

● పగటిపూట కుట్టిన దోమల వల్లే డెంగీ వస్తుందట నిజమేనా..?- రవికిషోర్, ఐడీఎస్ఎంటి కాలనీ, గద్వాల

డెంగీ వ్యాధికి కానీ ఇతర రోగాలు ముఖ్యంగా దోమల వల్లే వస్తాయి. అయితే పగటి సమయంలో ఇంట్లోకి ప్రవేశించిన దోమలు రాత్రివేళల్లో ఎక్కువగా కుట్టడంతో డెంగీ అయినా, మలేరియా అయినా ఇతర రోగాలు అయినా వ్యాప్తి చెందుతాయి. కాబట్టి సాయంత్రం అయ్యిందంటే చాలు ఇంటితలుపులు మూసివేసి దోమల నివారణకు కాయిల్స్ వాడాలి.

● సీజనల్ వ్యాధులపై చర్యలేమైనా..: పరశురామ్, రెండవ రైల్వేగేట్, గద్వాల

జిల్లాలో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు, వారిని గుర్తించి నివారించేందుకు 10 ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు రంగంలో ఉన్నాయి. ఈ టీంల ద్వారా వ్యాధుల బారిన పడిన వారిని గుర్తించడంతో పాటు వ్యాధుల నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టడం జరుగుతుంది. అలాగే జిల్లా కేంద్రంలో కలెక్టర్ చైర్మన్‌గా సంబంధిత అధికారులు సభ్యులుగా ఉంటూ మరో ర్యాపిడ్ టీం ఉన్నది. అత్యవసర పరిస్థితులలో ఈ టీం కూడా సీజనల్ వ్యాధుల నివారణపై చర్యలు తీసుకుంటుంది.

● దోమల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి: సంధ్య, గద్వాల.

దోమల నివారణతో పాటు నిల్వ ఉన్న నీటిని తొలగించేందుకు ప్రతీ శుక్రవారం డ్రైడే కార్యక్రమాలను నిర్వహించాలి. దీంతో నీరు నిలువ ఉండకపోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటంతో దోమల నివారణ సాధ్యమౌతుంది. దీంతో రోగాలు తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉంటాయి. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ప్రతీ శుక్రవారం డ్రై డేను తప్పక పాటించాలి.

అడవి జంతువుల సంరక్షణకు

రెస్క్యూ ఆపరేషన్

» ఏటీఆర్‌లో రెండు రోజుల శిక్షణ తరగతులు

» తుపాకీతో మత్తుమందు బుల్లెట్‌లను సంధించడంపై తర్ఫీదు



తుపాకులతో నమూనా బుల్లెట్లను సంధిస్తున్న రెస్క్యూ టీమ్‌ల సభ్యులు

మన్ననూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అభయారణ్య ప్రాంతాల్లో రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేసేందుకై మన్ననూరు పర్యావరణ విజ్ఞాన కేంద్రం ఆవరణలో రెండు రోజుల శిక్షణ తరగతులను డీఎఫ్‌వో రోహిత్ గోపిడి శుక్రవారం ప్రారంభించారు. పెద్దపులి, చిరుతపులి, ఎలుగుబంటిలతో పాటు ఇతర అటవీ వన్యప్రాణులు గ్రామాల్లోకి ప్రవేశించడం, వన్యప్రాణులు గాయపడడం, ఏదేని ప్రమాదస్థితిలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ ఉన్న సందర్భాల్లో వాటిని పట్టుకొని సురక్షిత ప్రాంతాలకు చేర్చడం, ప్రాథమిక వైద్యం అందించి క్షేమంగా అడవిలోకి పంపించడం కోసం ఈ రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేస్తున్నారు.

రాష్ట్రంలోని అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతం(ఏటీఆర్) సర్కిల్, కవ్వాల్ టైగర్ రిజర్వ్, వరంగల్ కాకతీయ జూపార్క్, హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్‌పార్కు , వికారాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, బద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, నాగార్జున సాగర్ ప్రాంతాల నుంచి రెస్క్యూ ఆపరేషన్ చేసే 50 మంది అటవీ సిబ్బంది శిక్షణ తరగతులకు హాజరయ్యారు. రెస్క్యూ టీం ట్రైనింగ్ అధికారి శ్రీశైలం సబ్ డీఎఫ్‌వో అబ్దుల్ రవూఫ్ ఆధ్వర్యంలో మొదట పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో తుపాకులు, మత్తు మందును అడవి జంతువులకు సంధించే విధానంపై ప్రొజెక్టర్ ద్వారా డిజిటల్ తెరపై అవగాహన కల్పించారు. అనంతరం జంతు వైద్య అధికారుల పర్యవేక్షణలో రెస్క్యూ బృందాలు తుపాకులతో నమూనా బుల్లెట్లను సంధించే ప్రాక్టీస్ చేశారు.

రెండో రోజు శిక్షణ తరగతుల ముగింపునకు పీసీసీఎఫ్ ఏలూసింగ్ మేరూ హాజరవ్వనున్నారు. కార్యక్రమంలో అచ్చంపేట , అమ్రాబాద్ ఎఫ్‌డీవోలు చంద్రశేఖర్, రామమూర్తి, రేంజ్ అధికారులు వీరేశం, గురుప్రసాద్, ఈశ్వర్, శరత్ చంద్ర, ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజర్ దేవరాజ్, డీఆర్‌వో శ్రీకాంత్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు

అధ్వానం

» కనీస సౌకర్యాలు లేక చిన్నారులు, టీచర్లు, ఆయాల ఇక్కట్లు

» విద్యుత్ సౌకర్యం కూడా లేక చీకట్లో మగ్గుతున్న కేంద్రాలు

» ఆయాల పోస్టులు భర్తీ కాకపోవడంతో బాలింతల ఇంటికే సరకుల పంపిణీ



చారకొండలోని 3వ అంగన్‌వాడీ కేంద్రంలో శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్డి

నాగర్‌కర్నూల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శిశు సం రక్షణ, పోషక ఆహారం, బాలింతల సంరక్షణ కోసం ఉద్దేశించిన అంగన్‌వాడీ కేంద్రాలు ఉమ్మడి జిల్లాల్లో నిర్వీర్యంగా మారుతున్నాయి. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల నియామకం చేపట్టకపోవడంతో అవి ప్రస్తు తం నామమాత్రంగా మారాయి. కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాల సంయుక్త భాగస్వామ్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై సరైన పర్యవేక్షణ లేకపోవడం కారణంగా ఉద్దేశం మంచిదైనా అల్లుని నోట్లో శని అన్న చందంగా వ్యవహారం మారింది.

● ఉమ్మడి జిల్లాలో సౌకర్యాలు కరువు

ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో జిల్లాల వారీగా అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితిని సమీక్షిస్తే అంతటా నిరాశే కన్పిస్తోంది. సొంత భవనాలు లేకపోవడం, కాలకృత్యాలు తీర్చుకోవడానికి వసతులు లేక కనీస సదుపాయాలు కరువై అంగన్‌వాడీ కేంద్రాలు త్రిశంకు స్వర్గంలో ఊగిసలాడుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో మొత్తం 1131 అంగన్‌వాడీ కేంద్రాలుండగా 202 అద్దె భవనాలు, గ్రామ ప్రజల సహకారంతో 409ఉచిత భవనాలు, 520 సొంత భవనాలున్నాయి. వీటిలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి కనీస వసతులు లేని అంగన్‌వాడీ కేంద్రాలు 641 ఉండగా మహబూబ్‌నగర్ జిల్లాలో కూడా అదే పరిస్థితి నెలకొంది. జిల్లాలో 1163 కేంద్రాలు ఉండగా టాయిలెట్లు, తాగునీటి వసతి లేని అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య 153 దాకా ఉంది. గద్వాల జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య కంటే టాయిలెట్లకు నోచుకోలేని అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య 232దాకా ఉండగా తాగునీటి వసతి లేని కేంద్రాలు 150దాకా ఉన్నాయి. అంగన్‌వాడీ టీచర్లు 652 దాకా ఉండాల్సి ఉండగా 61ఖాళీలు ఉన్నాయి. సహాయకుల సంఖ్య 622కుగాను 291దాకా ఖాళీలు ఉన్నాయి. నారాయణపేట జిల్లాలో కూడా పరిస్థితి ఇందుకు భిన్నంగా లేకపోవడం గమనార్హం. జిల్లాలో మొత్తం 704 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా కనీస సౌకర్యాలు లేని కేంద్రాలు 391దాకా ఉండటం గమనార్హం.

మహిళల అభ్యున్నతికి

ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తూ మహాలక్ష్మి పథకం అమలు చేస్తోందని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని టీజీఆర్టీసీ బస్టాండులో మహాలక్ష్మి పథకం విజయవంతం సదస్సు నిర్వహించారు. నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో మేనేజర్ యాదయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సుకు స్థానిక ఎమ్మెల్యే హాజరై ఉచిత బస్సు సౌకర్యం వల్ల కలిగే ప్రయోజనాలను మహిళలకు, విద్యార్థినులకు వివరించారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థినులకు ఆర్టీసీ నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్లు పద్మమ్మ, శ్రీనివాసులు, తీగల సునేంద్ర, జక్కా రాజ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బాదం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

వేగవంతం చేయండి



రామనంతపూర్ గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

కొత్తకోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ అధికారులను కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని కొత్తకోట మండల రామనంతపూర్ గ్రామంలో ఫ్రైడే డ్రైడేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ ప్రక్రియను దశల వారీగా పూర్తి చేసిన వెంటనే ఫొటోలు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసి బిల్లులు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి ఇంటి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అంతకుముందు గ్రామ వీధుల్లో పర్యటించి పరిశుభ్రతను పరిశీ లించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే సీజనల్ వ్యాధులను నివారించ వచ్చన్నారు. ఇళ్ల సమీపంలో మురికి నీరు నిల్వ ఉండకుండా ప్రజలు చూసు కోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పించి భాగస్వాములు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు, ప్రోగ్రాం ఆఫీసర్ సాయినాథ్‌రెడ్డి, హౌసింగ్ పీడీ విఠోబా, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కృష్ణయ్య ఉన్నారు.

వైద్యుడి నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

» మెడపై కణతిని తొలగించమంటే కాటికి పంపారంటూ కుటుంబీకుల ఆరోపణ

» ఓ ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రి నిర్వాకం

» ఆసుపత్రి ముందు కుటుంబ సభ్యులు, బంధువుల ఆందోళన

6



ఆసుపత్రి ముందు ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు



గద్వాల వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో తామరపూల అలంకరణలో..

భక్తిశ్రద్ధలతో శ్రావణ మాస పూజలు

- అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు

6

అచ్చంపేటకు బిహార్ పోలీసులు

» సైబర్ నేరంలో నిందితుడి కుటుంబ సభ్యుల విచారణ

» వారి ఇల్లు, మెడికల్ దుకాణాల్లో తనిఖీలు

6

పీడిత ప్రజల భావజాలమే గద్దర్ గళం

» తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ వెన్నెల

» 'ప్రజా యుద్ధ నౌక గద్దరన్న' సీడీ ఆవిష్కరణ

6

తేజేశ్వర్ హత్య కేసులో.. పోలీసు కస్టడీకి ఇద్దరు నిందితులు

» ఇన్వెస్టిగేషన్ అధికారి టంగుటూరి శ్రీను

6

31న కంటి ఆపరేషన్ శిబిరం

కందనూలు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యారోగ్య శాఖ, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 31న గురువారం ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ ఆప్తాలమిక్ అధికారి కొ్ట్ర బాలాజీ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనం గది నెంబరు 102లో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి, క్యాటరాక్ట్ పొర గల వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని ఏనుగొండ లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయించనున్నట్లు పేర్కొన్నారు. రోగులు ముందుగా బీపీ, షుగరు పరీక్షలు చేసుకుని రిపోర్టు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఈ ప్రాంత రోగులు ఆధార్, రేషన్‌కార్డు, ఓటరు కార్డు, ఏదేని గుర్తింపు కార్డు, జిరాక్స్ కాపీ, ఫోన్ నెంబరును తమ వెంట తెచ్చుకోవాలని తెలిపారు. వివరాలకు 9440876556, 7386940480లో సంప్రదించాలన్నారు.

జాతీయ శిక్షణకు ఉపాధ్యాయుడి ఎంపిక

» జీడిపల్లితండా ఉపాధ్యాయుడు రఘురాంకు అవకాశం


రఘురాం

కల్వకుర్తి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నూతన జాతీయ విద్యావిధానం -2020లో భాగంగా బోధన అభ్యసన పద్ధతులను సృజనాత్మకంగా మార్చేందుకు ఏర్పాటు చేసిన జాతీయ శిక్షణ కార్యక్రమానికి కల్వకుర్తి మండలం జీడిపల్లితండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రఘురాం ఎంపికయ్యారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 10 వరకు రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్‌లోని సీసీఆర్‌టీలో జరగనున్న శిక్షణకు ఎంపికయ్యారు. గత నెల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి శిక్షణలో వినూత్న బోధనా పద్ధతులు, విద్యార్థుల హాజరు పెంచే సృజనాత్మక కార్యక్రమాలు, ప్రజల భాగస్వామ్యంతో పాఠశాల అభివృద్ధి, టీఎల్ఎం వంటి అంశాల మీద పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రదర్శించి నిపుణుల ప్రశంసలు అందుకున్నారు. మొత్తం తెలంగాణ రాష్ట్రం నుంచి పది మంది ఎంపిక కాగా నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి రఘురాం జీడిపల్లితండా ప్రాథమిక పాఠశాల నుంచి రఘురాం, ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గాజుల వెంకటేశ్ ఎంపికయ్యారు. జాతీయ స్థాయి వేదికపై ప్రతిభకు అవకాశం రావడం పట్ల ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు తోటి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

తపాలా బీమాను సద్వినియోగం చేసుకోవాలి

» వనపర్తి డివిజన్ తపాలా పర్యవేక్షకుడు భూమన్న


రికార్డులను పరిశీలిస్తున్న భూమన్న

వెల్దండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : తపాలా శాఖ ద్వారా అందిస్తున్న జీవిత, ప్రమాద బీమాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి డివిజన్ తపాలాశాఖ పర్యవేక్షకుడు భూమన్న సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తపాలా కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ప్రీమియంతో తమ శాఖ ద్వారా బీమాసౌకర్యం పొందవచ్చునన్నారు. అదేవిధంగా వాణిజ్య బ్యాంకుల మాదిరిగానే పొదుపు, రికరింగ్ డిపాజిట్లు, ఆడపిల్లలకు సుకన్యయోజన పథకాలు ఉన్నాయన్నారు. ప్రైవేటు కంపెనీలతో కలిసి తక్కువ ప్రీమియంతో పెద్దమొత్తంతో బీమా పొందే అవకాశాలు ఉన్నాయని వివరించారు. తపాలాశాఖ నగదురహిత కార్యక్రమాలు చేపడుతుందని భూమన్న తెలిపారు. కార్యక్రమంలో పీపీఎం వెంకటేశ్వర్లు, సిబ్బంది రతన్‌నాయక్, రాజేందర్‌రెడ్డి, పుష్పగిరిరావు, శ్రీనునాయక్, సత్యం, పవన్ ఉన్నారు.

అచ్చంపేటకు బిహార్ పోలీసులు


» సైబర్ నేరంలో నిందితుడి కుటుంబ సభ్యుల విచారణ

» వారి ఇల్లు, మెడికల్ దుకాణాల్లో తనిఖీలు


పట్టణంలో విచారిస్తున్న పోలీసులు

అచ్చంపేట టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సైబర్ క్రైంకు సంబంధించిన విచారణ కోసం బిహార్ రాష్ట్రానికి చెందిన పోలీసులు శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేటకు వచ్చారు. ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం... వెంకటరమణ అనే వ్యక్తి పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. అతడి కుమారుడు అనిరుధ్ ఉన్నతవిద్య పూర్తిచేసి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. అతడు సైబర్ నేరాలకు పాల్పడి బిహార్ రాష్ట్రానికి చెందిన పలువురు బ్యాంకు ఖాతాల్లో నుంచి దాదాపు రూ. 2 కోట్ల మేర డ్రా చేశాడు. ఆ డబ్బును తండ్రి వెంకటరమణ, నల్గొండ జిల్లా కోదాడకు చెందిన తన భార్య ఖాతాలకు మళ్లించాడు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు కావడంతో బిహార్ రాష్ట్రం నుంచి డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది శుక్రవారం అచ్చంపేటకు చేరుకున్నారు. పట్టణంలోని వెంకటరమణ ఇల్లు, మెడికల్ షాపు, సమీప బంధువుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. అనిరుద్ కోసం గాలించగా ఆచూకీ లభించలేదని ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు


క్రేన్ సహాయంతో కారును బయటకు తీస్తున్న గ్రామస్థులు

ఆత్మకూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ బస్సును తప్పించే ప్రయత్నంలో కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండల పరిధిలోని మూలమల్ల గ్రామంలో ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేవరకద్రకు చెందిన యువకులు శుక్రవారం మధ్యాహ్నం ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు సందర్శనకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 6 గంటల సమయంలో మూలమల్ల గ్రామం మీదుగా వెళ్తుండగా ఎదురుగా స్కూల్ బస్సు వచ్చింది. బస్సును తప్పించబోయి అదుపు తప్పిన కారు చెరువులోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న యువకులు అప్రమత్తమై కిందకు దూకడంతో ప్రాణాపాయం తప్పింది. అనంతరం క్రేన్ సహాయంతో కారును బయటకు తీశారు.

కాకర్లపాడు రోగం


ఒకేచోట కూర్చున్న గ్రామస్థులు

» రెండు నెలలుగా విషజ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు
» నిత్యం జిల్లా ఆసుపత్రికి ఇద్దరు
» ప్రతీ ఇంట్లో ఎవరిని కదిలించినా కాళ్ల నొప్పులే..
» కాకర్లపాడ్ గ్రామంలో పారిశుధ్య చర్యలు శూన్యం


ఇంటి వద్ద తీవ్ర జ్వరంతో పడుకున్న మన్నెమ్మ

నవాబ్‌పేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కాకర్లపాడ్ గ్రామానికి రోగమొచ్చింది. ప్రతీ ఇంట్లో ఎవరిని కదిలించినాతీవ్ర కీళ్ల నొప్పులు, జ్వరంతో బాధపడుతున్నారు. గ్రామానికి చెందిన మన్నెమ్మ తన పనులు చేసుకుంటూ ఎంతో హుషారుగా ఉండగా, ఉన్నట్లుండి కీళ్ల నొప్పులు మొదలై జ్వరంతో మంచం పట్టింది. యాదయ్య పొలం పనులు చేసుకుంటూ గ్రామంలో అందరిని కలుస్తుండేవాడు. వారం రోజులుగా ఇంటి నుంచి బయటకు రావడం లేదు. ఇలా గ్రామంలో అందరికీ రోగమొచ్చి ఆసుపత్రిలో, ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఏ ఇంట్లో చూసినా ఒకరి నుంచి నలుగురి వరకు తీవ్ర జ్వరంతో అల్లాడిపోతున్నారు.

రెండు నెలలుగా ఇదే తంతు..

గ్రామానికి చెందిన గడ్డమీది రమేష్ తాపీ మేస్త్రీ పని చేసి ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో మొదట ఆయనకు చికున్ గున్య సోకింది. ఇది ఒక్కరితో మొదలై ఊర్లో అందరిని పట్టి పీడిస్తోంది. పిల్లలతో సహా వృద్ధులు సైతం అందరికి ఈ వ్యాధి బారిన పడినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో ఎవరిని కలిసినా కాళ్ల నొప్పుల గురించే మాట్లాడుకుంటున్నారు. కుర్చున్న చోట ఒకరికొకరు బాధలు చెప్పుకుంటున్నారు. జిల్లా కేంద్రానికి సుమారు పది కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామ ప్రజలు నిత్యం ఏదో ఒక పని చేసుకుంటు జీవనం సాగిస్తుంటారు. ఇప్పుడు ఎక్కువ శాతం రెండు నెలలుగా మంచం పట్టి కాలం వెల్లదీస్తున్నారు.

పారిశుధ్య చర్యలు శూన్యం

గ్రామంలో పారిశుధ్య చర్యలు అంతంతమాత్రంగా ఉన్నాయి. ఎస్సీ, బీసీ, ఇతర కాలనీలలో ఎలాంటి శుభ్రత చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. మురికి ఉన్న ప్రాంతాలను గుర్తించి చెత్త తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని గ్రామస్థులు వాపోయారు.

క్షేత్రస్థాయిలో పనిచేయని వైద్య సిబ్బంది

గ్రామంలో రోగాలు విజృంభిస్తుంటే స్థానికంగా అందుబాటులో ఉండే ఆశాకార్యకర్తలు ఎందుకు అధికారులకు సమస్యలు వివరించలేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇంత సమస్యను చిన్నదిగా చూపించి కేవలం తూతూ మంత్రంగా ఇలా వచ్చి పర్యటనలు చేసి వెళ్తున్నారే తప్పా రోగాన్ని గుర్తించి నయం చేసేందుకు క్యాంపులు ఏర్పాటు చేయకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాగా శుక్రవారం మండల పీహెచ్‌సీ అధికారుల బృందం ఎంఈఎల్‌వో రాములు ఆధ్వర్యంలో కాకర్లపాడులో పర్యటించింది. మురుగు, కుండల్లో ఉన్న నిల్వ నీరు పారబోశారు. మోకాళ్ల నొప్పులున్న వారిని పీహెచ్‌సీ వెళ్లి వైద్యం చేయించుకోవాలని సూచించారు.

పట్టించుకోవడం లేదు..



గ్రామంలో రోగాల పాలవుతున్న తమను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇలా వచ్చి మందు గోలీలు ఇచ్చి పోతున్నారు. ఏం జరిగింది? ఎందుకు వచ్చింది ఈ రోగం అని డాక్టర్లు తమ గ్రామానికి వచ్చి అడగడం లేదు. మా ప్రాణాలు పోతున్న పట్టించుకోరా?

\- చుక్కమ్మ కాకర్లపాడ్

అందరికీ ఇదే రోగం..



మా ఊర్లో కొన్ని రోజులుగా కాళ్ల నొప్పుల రోగం ఉంది. చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. డాక్టర్లు రావడం లేదు. రోజూ పాలమూరు దవాఖానాకు మా ఊరోళ్లు పోతున్నారు. డాక్టర్లు మా ఊరుకు వచ్చి రోగం తగ్గేలా చూడాలి. నా తోటి విద్యార్థులు కూడా కాళ్ల నొప్పులతో పాఠశాలకు వస్తున్నారు.

\- శివాని, కాకర్లపాడ్

చికున్ గున్య కేసులు అనలేం..

గ్రామంలో కొంతమందికి నొప్పులు ఉన్నట్లు చెబుతున్నారు. అయితే ఇవి చికున్ గున్య కేసులు అనలేం. గ్రామంలో కేవలం కాకార్లపాడ్ వరకే 2,500 మంది ఉంటారు. ఇందులో 400 కుటుంబాలు ఉంటాయి. నిత్యం ప్రజలకు మాత్రలు అందజేస్తున్నాం. తాజాగా గ్రామానికి చెందిన వారు జిల్లా ఆసుపత్రికి వెళ్లినట్లు తెలిసింది. వ్యాధి నిర్ధారణ తర్వాతే మాత్రలు అందజేస్తున్నాం ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటున్నాం.

\- రజిత, ఏఎన్ఎం, కాకర్లపాడ్

వైద్య శిబిరం ఏర్పాటు చేస్తాం

కాకర్లపాడ్ గ్రామంలో ప్రజల అవగాహనలేమితో సీజనల్ వ్యాధులు వస్తున్నాయి. చికున్‌గున్య నివారణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తాం. ముందుగా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వైద్య సిబ్బంది సూచనలు పాటించాలి.

\- కృష్ణ, డీఎంహెచ్‌వో, మహబూబ్‌నగర్

పీడిత ప్రజల భావజాలమే గద్దర్ గళం

» తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ వెన్నెల
» 'ప్రజా యుద్ధ నౌక గద్దరన్న' పాటల సీడీ ఆవిష్కరణ


జయప్రకాశ్ రచించి పాడిన ప్రజా యుద్ధనౌక గద్దరన్న పాటల సీడీని ఆవిష్కరిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారథి, చైర్ పర్సన్ డాక్టర్ వెన్నెల

బిజినేపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పీడిత ప్రజల భావజాలమే గద్దర్ గళమై గర్జించిందని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ వెన్నెల అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలంలోని మహాదేవుని పేట గ్రామానికి చెందిన జయప్రకాశ్ రచించి, గానం చేసిన 'ప్రజా యుద్ధ నౌక గద్దరన్న' ఆడియో సీడీని శుక్రవారం హైదరాబాద్‌లోని సాంస్కృతిక సారథి కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ గద్దర్‌ను ఆదర్శంగా తీసుకొని ఉద్యమంలో గజ్జకట్టి ఆడి పాడి ప్రజలను చైతన్య పర్చిన వారిలో జయప్రకాశ్ ఒకరని గుర్తు చేశారు. కళాకారులు ఆట, పాట, మాటల్లో ముందు వరుసలో ఉండి సమాజ ఉద్ధరణలో భాగస్వాములు కావాలని తెలిపారు.

గడ్డం రవీందర్ అందించిన సంగీతం బాగుందని కొనియాడారు. కోరస్ గాయకులు లక్ష్మణ్, విజయ్‌కాంత్, అశోక్‌చారి, ఉదయ్, రాజు, సంతోష్, పద్మలను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అడ్మినిస్ట్రేషన్ అధికారి విజయ్ కుమార్, రచయిత య శ్‌పాల్ స్వామి, మాపల్లె శంకర్, నరసింహ, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడి నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

» మెడపై కణితిని తొలగించమంటే కాటికి పంపారంటూ కుటుంబీలకు ఆరోపణ
» ఓ ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రి నిర్వాకం
» ఆసుపత్రి ముందు కుటుంబ సభ్యులు, బంధువుల ఆందోళన


ఆసుపత్రిలో ఆందోళన చేస్తున్న మృతుని భార్య రాధ, నలుగురు పిల్లలు


కాటేపాగ రాజు (ఫైల్)

పెబ్బేరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మెడపై ఉన్న కంతిని తొలగించి చికిత్స చేసిన ఒక వైద్యుడి నిర్లక్ష్యానికి ఒక నిండు ప్రాణం బలైందని ఒక ప్రైవేట్ ఆసుపత్రి ముందు శుక్రవారం కుటుంబ సభ్యులు, బంధువులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాలు... వనపర్తి జిల్లా పెబ్బేరు మండంలోని పెంచికలపాడు గ్రామానికి చెందిన దళిత మేస్త్రీ కాటేపాగ రాజు(39) మెడపై ఉన్న కంతి చికిత్స కోసం 19న మునిసిపాలిటీలోని ఒక ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లాడు. ఆసుపత్రి వైద్యుడు ఎలాంటి వైద్య పరీక్షలు, మత్తు ఇంజక్షన్ చేయకుండానే అతడ్ని నిలబెట్టి మెడపై ఉన్న కంతిని తొలగించి కొన్ని మాత్రలు ఇచ్చారు. తరువాత రెండు రోజుల వరకు అదే ఆసుపత్రిలో తొలగించిన కంతిని డ్రస్సింగ్ చేయించుకున్నాడు. 22న ఆసుపత్రిలో డ్రస్సింగ్ చేయించుకునేందుకు వచ్చిన సందర్భంలో కంతి తొలగించిన ప్రాంతంలో బాగా నొప్పి ఉందని వైద్యుడికి చెప్పాడు. ఏం కాదు మాత్రలు వాడండి తగ్గిపోతుందన్నారు. 24న సాయంత్రం 7గంటలకు బహిర్భూమికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో కళ్లు తిరిగి కిందపడిపోయాడు. రాజు ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించగా కిందపడిపోయిన అతడ్ని అదే ఆసుపత్రికి తీసుకువెళ్లారు. నేను ఏం చేయలేను.. వనపర్తికి తీసుకువెళ్లాలని ఆసుపత్రి వైద్యుడు చెప్పాడు. వనపర్తి ఆసుపత్రిలోని వైద్యులు పరిశీలించి మెదడులో రక్తం గడ్డకట్టింది.. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకువెళ్లాలని సూచించారు. ఉస్మానియా ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ ఉన్న వైద్యులు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారన్నారు.

ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు

మృతుని కుటుంబ సభ్యులు కంతి వైద్యం చేసిన వైద్యుడి దగ్గరకు వెళ్లి మీ నిర్లక్ష్యం వల్లనే మృతి చెందాడని చెప్పారు. మృతి చెందడానికి.. నాకు ఎలాంటి సంబంధం లేదు.. నేను కేవలం కంతిని తొలగించి చీము తీసి రెండు కుట్లు వేశానని వైద్యుడు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. ఆగ్రహంతో ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతుని కుటుంబ సభ్యులకు నచ్చచెప్పి శాంతింప చేశారు. పెద్దమనుషుల సమక్షంలో దళితుడైన మృతుడు కాటేపాగ రాజు ప్రాణం ఖరీదు రూ.3లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం తెలుస్తున్నది. మృతుడికి భార్య రాధతో పాటు తొమ్మిదేళ్ల సౌజన్య, ఏడేళ్ల మహేందర్, రెండేళ్ల బిట్టు, ఒక సంవత్సరం పాప ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తప్పు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం



ప్రైవేట్ ఆసుపత్రిలో కంతి తొలగించేందుకు చేసిన సర్జరీతోనే మృతి చెందారనే ఆరోపణలు మా దృష్టికి వచ్చింది. అర్హులైన వైద్యులు మాత్రమే సర్జరీ చేయాలి. కొన్ని అనివార్య కారణాలతో రాలేకపోయాను. దీనిపై శని వారం విచారణ అధికారిని నియమించి బా. ధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

\- డాక్టర్ అల్లే శ్రీనివాసులు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, వనపర్తి.

తేజేశ్వర్ హత్య కేసులో.. పోలీసు కస్టడీకి ఇద్దరు నిందితులు

» ఇన్వెస్టిగేషన్ అధికారి టంగుటూరి శ్రీను

గద్వాల క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన తేజేశ్వర్ హత్య కేసులో ప్రధాన నిందితులు ఇద్దరిని శుక్రవారం పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. జోగుళాంబ గద్వాల పట్టణానికి చెందిన లైసెన్స్‌డ్ సర్వేయర్ తేజేశ్వర్ హత్యకేసులో ఏ1 తిరుమల్‌రావు, ఏ2 ఐశ్వర్యలను మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకొని విచారించేందుకు అనుమతి లభించినట్లు ఇన్వెస్టిగేషన్ అధికారి, సీఐ టంగుటూరి శ్రీను శుక్రవారం తెలిపారు. ఈ నెల 10న ఏ1 తిరుమల్‌రావుతోపాటు ఏ3 నాగేశ్, ఏ4. పరశురామ్, ఏ5 రాజులను పోలీసులు నాలుగు రోజులు కస్టడీలోకి తీసుకొని విచారించారు. మరో సారి ఏ1 తిరుమల్‌రావుతో పాటు, ఏ2ను ఐశ్వర్యలను కస్టడీలోకి తీసుకునేందుకు పోలీసులు ఇటీవల కోర్టులో అప్పీలు చేశారు. అందుకు న్యాయాధికారి శుక్రవారం అనుమతి ఇవ్వడంతో ఇద్దరు నిందితులను పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. మూడు రోజుల పాటు వారిని విచారించి హత్యకు కారణాలను రాబట్టనున్నారు.

కల్లు దుకాణంపై ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారుల దాడి

» 468 లీటర్ల కల్లు ధ్వంసం, ముగ్గురిపై కేసు

గద్వాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం గోనుపాడు గ్రామంలోని కల్లు దుకాణంపై గురువారం రాత్రి ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు దాడులు నిర్వహించారు. మహబూబ్‌నగర్ నుంచి సీఐ బాలకృష్ణారెడ్డి, ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం గోనుపాడు గ్రామంలోని దుకాణాన్ని తనిఖీ చేశారు. లైసెన్స్ లేకుండా నిర్వహించడంతో పాటు కృత్రిమంగా కల్లును తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ దాడిలో 50 కేజీల చక్కెర, 5 కేజీల పేస్టును స్వాధీనం చేసుకున్నారు. 468 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. అదేవిదంగా 640 కల్లు పెట్టెలు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని, దుకాణం నిర్వాహకులు గుండ్రాతి సాంబశివుడు, లక్కిసాని కిషోర్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్‌లపై కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌లో ఇటీవల కల్తీకల్లు తాగి పలువురు మృతి చెందడంతో ఎక్సైజ్ అధికారులు లైసెన్స్‌లేని కల్లు దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో దాడులు నిర్వహించడం వారంలో ఇది రెండవ సారి.

నకిలీ పత్రాలు సృష్టించిన వ్యక్తి

» రూ. 10 లక్షలకు మార్టిగేజ్
» గద్వాల ఎస్ఐ కల్యాణ్‌కుమార్

గద్వాల క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఇతరులకు సంబంధించిన ప్లాటుకు నకిలీ పత్రాలు సృష్టించి, వాటిని రూ. 10 లక్షలకు మార్టిగేజ్ చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు గద్వాల ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలాలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని 3వ వార్డుకు చెందిన బోయ శ్రీనివాసులు సర్వే నెంబర్ 79/బిలోని ప్లాటును 2019లో షాలిబీ అనే మహిళ నుంచి కొనుగోలు చేశాడు. కానీ 2018 లో హెచ్. గోపాల్ అనే వ్యక్తి ఆ ప్లాటులో రేకుల షెడ్డు, దానికి ఇంటి నెంబర్ ఉన్నట్లు, దానిని తనతల్లి హెచ్.లక్ష్మి ద్వారా గిఫ్ట్‌డీడ్ పొందినట్లు నకిలీ పత్రాలను సృష్టించాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ప్లాట్ యజమాని బోయ శ్రీనివాసులు మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు గోపాల్ పేరును ఆన్‌లైన్‌లో నుంచి తొలగించారు. అయితే గోపాల్ తన వద్ద నున్న నకిలీ ధ్రువపత్రాలతో ఈ ఏడాది మార్చి 19న కర్నూలులోని శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్-2లో ఆస్తిని రూ. 10 లక్షలకు మార్టిగేజ్ చేశాడు. ఈ విషయంపై అసలు యజమాని బోయ శ్రీనివాసులు మే 26న పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు విచారణ చేపట్టి, శుక్రవారం నిందితుడు గోపాల్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ మాస పూజలు

» అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు


మహబూబ్‌నగర్‌లో ఎల్లమ్మ గుడిలో క్యూలైన్‌లో భక్తులు


గద్వాల కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహిళల సామూహిక కుంకుమార్చన


అమ్మవారికి హారతి ఇస్తున్న పూజా


ప్రత్యేక అలంకరణలో అన్నపూర్ణదేవి

మహబూబ్‌నగర్ న్యూటౌన్/ గద్వాల టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసంలో తొలి శుక్రవారం సందర్భంగా మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రాల్లోని ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మహబూబ్‌నగర్ కొత్త బస్టాండ్ సమీపంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి, చౌడేశ్వరి ఆలయాల్లో నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో నిత్యాభిషేకం ప్రారంభించారు. ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని తారమపూలతో అలంకరించారు. అన్నపూర్ణాదేవి ఆలయంలో అమ్మవారు గౌరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.


మహబూబ్‌నగర్‌లో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


మహబూబ్‌నగర్‌లో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

క్రైం కార్నర్

20 ద్విచక్రవాహనాలు సీజ్

» జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో తనిఖీలు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు

గద్వాల క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నెంబర్ ప్లేట్ లేని 20 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు ఆధ్వర్యంలో జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లాట్ లేనివి, ఉన్నా కనిపించకుండా చేసిన బైక్‌లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటికి సంబంధించిన ధ్రువపత్రాలను తీసుకొస్తే తిరిగి ఇస్తామని వాహనదారులకు స్పష్టం చేశారు. నిబంధనలను పాటించకపోతే కఠిన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో పశువుల మృతి



అవుసులోనిపల్లిలో కరెంటు షాక్‌తో చనిపోయిన ఆవు

కల్వకుర్తి/ ఊట్కూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండలంలో ఎద్దు, నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలంలో ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కల్వకుర్తి మండలంలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన రైతు బలమూరి బాలస్వామి ఎద్దు పొలంలో మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లడంతో విద్యుదాఘాతానికి గురై చనిపోయింది. దాని విలువ రూ.80 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. అలాగే ఊట్కూర్ మండలంలోని అవుసులోని పల్లి గ్రామానికి చెందిన రైతు వడ్డెమాన్ గోపాల్‌రెడ్డికి చెందిన ఆవు శుక్రవారం మధ్యాహ్నం బీడు భూమిలో మేత మేస్తుండగా విద్యుత్ తీగలకు తగిలి కరెంట్ షాక్‌కు గురై చనిపోయింది. దాని విలువ రూ. 60 వేలు ఉంటుందని బాధితుడు గోపాల్‌రెడ్డి తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

ఖిల్లాఘణపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండల కేంద్రం సమీపంలో గురువారం రాత్రి ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ నరేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన రాఘవేందర్ రెడ్డి గురువారం రాత్రి ద్విచక్రవాహనంపై ఖిల్లాఘణపురం నుంచి స్వగ్రామానికి బయలు దేరాడు. షాపూర్ స్టేజీ దాటిన తర్వాత రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టడంతో అతడు గాయపడ్డాడు. స్థానికులు అతడిని ఖిల్లాఘణపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి మాట్లాడే స్థితిలో లేకపోవడంతో ఏఎస్ఐ సత్యనారాయణ గౌడ్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బాధితుడి వివరాలు తెలుసుకునేందుకు యత్నిస్తున్నట్లు చెప్పారు.

నల్లమలలో శ్రీశైలానికి చెందిన వ్యక్తి అదృశ్యం

» ఆటోను స్వాధీనం చేసుకున్న అటవీ శాఖ అధికారులు



లక్ష్మణ్

మన్ననూర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, శ్రీశైలం క్షేత్రానికి చెందిన ఓ వ్యక్తి నల్లమల అడవిలో అదృశ్యం అయ్యాడు. అటవీశాఖ సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నా యి. నాగర్‌కర్నూలు జిల్లా, అమ్రాబాద్ మండల పరిధిలోని మన్ననూరు, వటవర్లపల్లి గ్రామాల మధ్య శుక్రవారం అటవీ శాఖ పెట్రోలింగ్ సి బ్బంది తనిఖీలు చేస్తుండగా ఓ ఆటో కనిపిం చింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా సం బంధించిన వారెవరూ కనిపించలేదు. దీంతో ఆటోను మన్ననూరులోని దు ర్వాసుల చెరువు బేస్ క్యాంపునకు తరలించారు. అనంతరం అధికారులు ఆ టోలో పరిశీలించగా ఆధార్‌కార్డు లభ్యమైంది. దానిపై ఉన్న నెంబర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఆ ఆటో శ్రీశైలంలోని వడ్డెరకాలనీకి చెందిన భీమ్‌రావు కుమారుడు మంజుల లక్ష్మణ్ అని తెలుసుకున్నారు. అతడు శుక్రవారం ఉ దయం శ్రీశైలం నుంచి బయలు దేరి, తిరిగి రాలేదని చెప్పారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే అటవీశాఖ రేంజ్ కార్యాలయానికి సమాచారం అందించాలని పెట్రోలింగ్ సిబ్బంది కోరారు.

లిక్కర్‌మార్ట్‌లో చోరీ

» రూ. 2 లక్షలు ఎత్తుకెళ్లిన దొంగలు

వనపర్తి రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రంలోని లిక్కర్ మార్ట్‌లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. టౌన్ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పట్టణ కేంద్రంలోని రామాలయం సమీపంలోని లిక్కర్ మార్ట్‌లో బ్రహ్మం అనే వ్యక్తి పని చేస్తున్నాడు. గురువారం రాత్రి మార్ట్‌ను మూసివేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం దుకాణాన్ని తెరిచి లోపలికి వెళ్లగా అనుమానాస్పదంగా వెలుతురు కనిపించింది. పైకి చూడగా, రేకులకు రంధ్రం కనిపించడంతో అనుమానంతో కౌంటర్‌ను తెరిచి చూశాడు. అందులోని రూ. 2,08,000 చోరీకి గురైనట్లు గుర్తించి, వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. వారు వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

మాతృభూమి రక్షణలో అమరుడైన శేఖర్

- 1996లో భారత సైన్యంలో చేరిన శేఖర్
- 1999 కార్గిల్ యుద్ధంలో విధి నిర్వహణ
- ఆర్మీ క్యాంపుపై ముష్కరుల దాడిలో మృతి
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి నేటికీ అందని పరిహారం

నేడు కార్గిల్ విజయ్ దివస్

దేశానికి సేవ చేయాలన్నది అతడి లక్ష్యం... గుండె నిండా సంకల్పం అతడిని ముందుకు నడిపించింది. అందుకు స్నేహితుల ప్రోత్సాహం తోడయ్యింది. ఆర్మీ ర్యాలీలో పాల్గొని తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించి భారత సైన్యంలో చేరాడు. కార్గిల్ యుద్ధ సమయంలో విధుల్లో ఉండగా, ఆర్మీ క్యాంపుపై శత్రు మూకలు దాడి చేయడంతో పలువురు ప్రాణాలు కోల్పోయారు. వారిలో అతడు కూడా ఉన్నాడు. అతడే మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కామారం గ్రామానికి చెందిన శేఖర్. నేడు (శనివారం) కార్గిల్ విజయదివస్ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- నవాబ్‌పేట (ఆంధ్రజ్యోతి)



గత ఏడాది శేఖర్ తల్లి రాధమ్మను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి (ఫైల్)



కార్గిల్ యుద్ధంలో మరణించిన శేఖర్ (ఫైల్)

మాతృ భూమి రక్షణ కోసం సైన్యంలో చేరిన శేఖర్ కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయాడు. మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలం కామారం గ్రామానికి చెందిన రామచంద్రయ్యాచారి, రాధమ్మ దంపతులకు ముగ్గురు సంతానం ఉన్నారు. వారిలో మూడవ కుమారుడు శేఖర్ యన్మనగండ్ల ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకుంటూ అన్నలకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. 1996లో తిరుపతి పట్టణంలో ఆర్మీ ర్యాలీ జరుగుతోందని స్నేహితుల ద్వారా అతడికి తెలిసింది. వారి ప్రోత్సాహంతో దరఖాస్తు చేసుకొని ర్యాలీలో పాల్గొన్నాడు. తొలి ప్రయత్నంలోనే సైన్యంలో ఉద్యోగం సాధించి 19-మద్రాస్ విభాగంలో చేరి, జమ్ము కశ్మీర్లో విధులు నిర్వహిస్తుండేవాడు. 1999, నవంబర్ 24న అతడు పూంచ్ సెక్టర్ వద్ద విధుల్లో ఉండగా, ఆర్మీ క్యాంపుపై ముష్కరులు దాడి చేశారు. ఈ దాడిలో శేఖర్ కూడా ప్రాణాలు కోల్పోయారు. ఆర్మీ అధికారులు ఈ విషయాన్ని టెలిగ్రాం ద్వారా అతడి కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతదేహాన్ని అతడి స్వగ్రామానికి తరలించింది. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించింది. అప్పటి మంత్రి నాగం జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యేలు శంకర్ రావు, ఎర్రశేఖర్‌లతో పాటు, కలెక్టర్ అనంతరాములు పాల్గొన్నారు.

సన్మానాలతో సరి..

కార్గిల్ యుద్ధంలో శేఖర్ మరణించడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అతడి కుటుంబంపై అపారమైన సానుభూతి వ్యక్తమయ్యింది. ఆయన ప్రాణత్యాగం వృథా కాదంటూ ఎంతో మంది కొనియాడారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు అతడి కుటుంబ సభ్యులను సన్మానించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మండల కేంద్రంలో శేఖర్ విగ్రహం ఏర్పాటు చేస్తామంటూ పలువురు ముందుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అతడి కుటుంబానికి రూ. 7.50 లక్షల పరిహారం అందింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 5 లక్షలు, 300 గజాల స్థలం ఇవ్వాల్సి ఉండింది. కానీ రూ. 5 వేలు మాత్రమే ప్రభుత్వం చెప్పడంతో కోర్టును ఆశ్రయించారు. కానీ ఇప్పటివరకు పరిహారం మాత్రం అందలేదు. ఈ విషయంపై శేఖర్ సోదరుడు ఈశ్వరయ్య, తల్లి రాధమ్మ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

గత ఏడాది కార్గిల్ దివస్ సందర్భంగా జిల్లా కేంద్రంలో శేఖర్ తల్లి రాధమ్మను ప్రస్తుత పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలు ఘనంగా సన్మానించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు రావలసిన పరిహారం, ప్లాటు ఇవ్వాలని శేఖర్ సోదరుడి కుమారుడు సత్యం విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జల్లులు

వనపర్తి/ నారాయణపేట/ నాగర్‌కర్నూల్ టౌన్/ మహబూబ్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి, శుక్రవారం జల్లులు పడ్డాయి. నారాయణపేట జిల్లా కోస్గీ మండలంలో 13.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. కొత్తపల్లి 9.8, దామరగిద్ద 9.3, ఊట్కూర్ 8.5, కృష్ణ 7.8, మద్దూర్ 6.8, నారాయణపేట మండలంలో 6.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. నాగర్‌కర్నూలు జిల్లా ఊర్కొండ మండలంలో 9.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పెద్ద కొత్తపల్లి మండలంలో 9.4, కల్వకుర్తిలో 7.0, లింగాలలో 6.2, అచ్చంపేట, వెల్దండ మండలాల్లో 6.0, ఉప్పునుంతల, తిమ్మాజిపేట మండలాల్లో 5.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వనపర్తి జిల్లా పెబ్బేరు, ఆత్మకూరులలో 4.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ జల్లులు కురిశాయి.

మహబూబ్‌నగర్ జిల్లాలో శుక్రవారం సాయంత్రం 6 గంటల తరువాత వాతావరణం ఒక్కసారి మేఘావృతమై కొద్దిసేపు వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 15 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గండీడ్ మండలంలో 11.7, బాలనగర్‌లో 11.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. జడ్చర్లలో రహదారులు జలమయం అయ్యాయి. మిగతా మండలాల్లో చిరు జల్లులు కురిశాయి.



భారీ వర్షానికి జడ్చర్లలో జలమయం అయిన రహదారి

వంతెన నిర్మాణానికి సహకరించాలి

» ఎంపీ మల్లురవిని కోరిన అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

» ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేత



ఎంపీ మల్లురవితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట/ అచ్చంపేట రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలంలోని మద్దిమడుగు సమీపంలో కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి సహకరించాలని అచ్చంపేట ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ ఎంపీ మల్లురవిని కోరారు. శుక్రవారం ఢిల్లీలో ఆయనను కలిసి సమస్యను వివరించి వినతిపత్రం ఇచ్చారు. అంతర్రాష్ట్ర వంతెనతో పాటు అచ్చంపేట మండలంలోని ఉమామహేశ్వరంలో రోప్ వే నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. వంతెనను నిర్మిస్తే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య దూరం తగ్గుతుందని, రవాణా సౌలభ్యం కలుగుతుందని ఆయనకు తెలిపారు. అందుకు ఎంపీ సానుకూలంగా స్పందించారని, ఈ విషయాన్ని పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తానని చెప్పినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్

» వనపర్తి జిల్లా న్యాయాధికారి ఎం.ఆర్ సునీత

వనపర్తి లీగల్ కంట్రిబ్యూటర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మధ్యవర్తిత్వం ద్వారా పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వనపర్తి జిల్లా న్యాయాధికారి ఎం.ఆర్.సునీత తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో దేశంలోని అన్ని కోర్టుల్లో ఈ నెల 1 నుంచి సెప్టెంబరు 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వనపర్తి కోర్టుల్లో పెండింగ్ కేసులను విభాగాల వారిగా విభజించినట్లు తెలిపారు. వాటిలో మధ్యవర్తిత్వానికి అనుకూలంగా ఉన్న 654 కేసులను గుర్తించినట్లు చెప్పారు. కేసులను సామరస్యంగా, తక్కువ ఖర్చుతో, వేగవంతంగా పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం ఉపకరిస్తుందని తెలిపారు. ఇందులో ఇరు వర్గాలకు విజయం వర్తిస్తుందని చెప్పారు. ఇరువర్గాలు మాత్రమే మాట్లాడుకుంటాయని, వారి సమ్మతితో కేసులు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఈ 90 రోజుల ప్రణాళికలో భాగంగా గుర్తించిన కేసులకు సంబంధించి ఇరు వర్గాలకు నోటీసులు పంపించనున్నట్లు తెలిపారు. అందులో వైవాహికం, వినియోగదారులు, ఆస్తి విభజన, భూమి, కుటుంబ వివాదాలతో పాటు, రాజకీయ పరిష్కార యోగ్యమైన క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. అనంతరం స్పెషల్ డ్రైవ్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రజని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, సెక్రటరీ కె.వెంకటరమణ, ఏజీపీ మునగారి కృష్ణ, న్యాయవాదులు షాకిర్ హుస్సేన్, వెంకటేశ్, శుభారాణి, రాజుగౌడ్, చందర్ నాయక్, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు రఘు, శ్రీదేవి పాల్గొన్నారు.

వుషు ఉమెన్స్ లీగ్‌కు 10 మంది విద్యార్థినులు



వుషు ఉమెన్స్ లీగ్‌కు ఎంపికైన విద్యార్థినులతో అసోసియేషన్ సభ్యులు

జడ్చర్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 27న నిర్వహించనున్న ఖేలో ఇండియా వుషు ఉమెన్స్ లీగ్ - 2025 పోటీలకు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 10 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. జడ్చర్ల పట్టణంలోని మినీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థినులు పాల్గొన్నారు. వారిలో జస్మిత, హారిక, సమన్వి, దీక్షిత, కారుణ్య, మేఘన, జి.హర్షిత, లాస్యశ్రీ, హర్షిత, సమీనాబేగంలను ఎంపిక చేసినట్లు ఉషు అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి తాజుద్దీన్ తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో అసోసియేషన్ జిల్లా కోశాధికారి ఇలియాస్ బిన్‌సిద్దిఖ్, బాలు, అశ్వక్, సభ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.

జములమ్మ ఆలయ హుండీ లెక్కింపు

» రూ.29 లక్షల ఆదాయం



హుండీని లెక్కిస్తున్న ఆలయ అధికారులు, ఎస్‌వీఎస్ సభ్యులు

గద్వాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలోని జములమ్మ ఆలయం హుండీని శుక్రవారం లెక్కించారు. ఎండోమెంటు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఈవో పురేందర్ కుమార్, ఆలయ చైర్మన్ వెంకట్రాములు ఆధ్వర్యంలో హుండీల సీళ్లు తొలగించి నగదును లెక్కపెట్టారు. మొత్తం 4 నెలల హుండీని లెక్కించగా రూ.29,34,460 ఆదాయం సమకూరింది. అందులో రూ.27,06,880 నోట్లు, రూ.2,27,580 నాణేలు ఉన్నాయి. దీంతో పాటు దాదాపు అర కిలో మిశ్రమ వెండి వచ్చింది. హుండీ లెక్కింపులో ఆలయ డైరెక్టర్లు మంగలి వీరేశ్, ముసిలన్న, చందు, మల్లేశ్, మధుమతి, రాధారెడ్డి, బీసన్న, ఎస్‌వీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఎంపీడీవో కుమారుడు




ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తన కుమారునికి అడ్మిషన్ తీసుకుంటున్న ఎంపీడీవో శంకర్‌నాయక్

చారకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ ఎంపీడీవో మాలోతు శంకర్‌నాయక్ తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, తోటి ఉద్యోగులకు ఆదర్శప్రాయుడిగా నిలిచాడు. శుక్రవారం ఆయన తన కుమారుడు మాలోతు భువన్ సాయి నాయక్‌ను చారకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో చేర్పించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోను జీహెచ్‌ఎం భగవాన్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

తాడూరు/ నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష పడినట్లు తాడూరు ఎస్ఐ గురుస్వామి, నాగర్‌కర్నూల్ ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలోని యంగంపల్లి గేట్ సమీపంలో రెండు రోజుల క్రితం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో గుంతకోడూరు గ్రామానికి చెందిన కొప్పునూర్ వెంకటయ్య మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. శుక్రవారం అతడిని కోర్టులో హాజరుపర్చగా ఒక రోజు జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి శ్రుతి దూత ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్ తెలిపారు. అలాగే మిడ్జిల్ మండలం బోయినపల్లికి చెందిన బోయలాలు మద్యం తాగి వాహనం నడుపుతూ నాగర్‌కర్నూల్‌లో పట్టుబడ్డాడు. అతడిని కోర్టులో హాజరు పరచగా ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు.



'పేట' కలెక్టరేట్‌లో గాంధీ చిత్రాన్ని వేస్తున్న లక్ష్మణ్



కింగ్‌డమ్ కటౌట్‌ను తయారు చేస్తున్న లక్ష్మణ్

పేట నుంచి సినీ పరిశ్రమకు..

» చిత్రకళలో లక్ష్మణ్‌ది అందెవేసిన చేయి

» పలు సినిమా కటౌట్లకు కుంచెతో రంగులు అద్దిన కళాకారుడు

నారాయణపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నారాయణపేటకు చెందిన చిత్రకళాకారుడు అక్కల లక్ష్మణ్ అంచెలంచెలుగా ఎదిగారు. తాజాగా చిత్రపరిశ్రమలో కింగ్‌డమ్ చిత్రంలో 80 శాతం తన కుంచెతో రంగులు దిద్దిన చిత్రాలు ఎన్నో వేశారు. తన చేతి నైపుణ్యంతో ఆకట్టుకునే విధంగా విభిన్న ఆకృతులతో చిత్రాలు గీయడంలో దిట్టగా పేరు తెచ్చుకున్నారు. నారాయణపేటలో గణేష్ నిమజ్జన వేడుకల్లో ఎన్నో విభిన్నమైన అలంకరణలు తన చేతితో వేసి కళా నైపుణ్యాన్ని చాటుతూ వస్తున్నాడు. పాఠశాలలకు సైతం రంగులు వేయడంలో దిట్టగా పేరుంది. నారాయణపేట కలెక్టరేట్ చాంబర్‌లో గాంధీ చిత్రం చక్కగా వేశారు. ఎంతో మంది రాజకీయ నేతలు, ప్రముఖుల ముఖ చిత్రాలు వేసి వారికి అందిస్తూ ఎన్నో ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం సినీరంగంలో బాగ్ సాధే బాగ్, కోర్టు, పెద్ది, కింగ్‌డమ్ చిత్రాలకు పనిచేస్తున్నారు.



సెట్‌లో విజయ్‌దేవరకొండ చిత్రం

న్యూస్ బాక్స్

మొక్కలు నాటి సంరక్షించాలి

● ఎస్ఐ నాగ శేఖర్ రెడ్డి



మద్దూరు యూపీఎస్‌లో మొక్కను నాటుతున్న ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి

వడ్డేపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడ పర్యావరణంతో ముడిపడిందని శాంతినగర్ ఎస్ఐ నాగ శేఖర్‌రెడ్డి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం మద్దూరులోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మొక్కను నాటారు. పాఠశాలలతో పాటు ఇంటి ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు ఉన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

గట్టు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 40మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యులు విద్యార్థులకు వివరించారు. వైద్యశిబిరంలో వైద్యాధికారి సూర్యప్రకాశ్, హాస్టల్ వార్డెన్ బస్వరాజ్, వెంకటేశ్వర్లు, వెంకటాద్రినాయుడు, మల్లేశ్, ఆశా కార్యకర్తలు హారతి, సరళ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

మానవపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దపోతులపాడులో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, పంచాయతీ కార్మికులు వివిధ కాలనీల్లో పర్యటించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని గ్రామస్థులకు సూచించారు. ఇళ్లల్లో నీటిని నిల్వ ఉంచవద్దని, దీనివల్ల దోమలు తమ సంతతిని పెంచుకుంటాయన్నారు. వర్షాకాలంలో ఇళ్లమధ్యలో మురుగు ఉండకుండా శుభ్రతను పాటించాలని చెప్పారు.

పత్తి రైతులను ఆదుకోవాలి

● విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్‌కు వినతి

గద్వాల టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నడిగడ్డలో సీడ్‌పత్తి సాగుచేస్తున్న రైతులు మోసానికి గురికాకుండా ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం కార్యదర్శి తీగల సాగర్ కోరారు. సంఘం జిల్లా నాయకులు, రైతులతో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. వారిలో సంఘం రాష్ట్ర నాయకుడు శోభన్‌నాయక్, శ్రీరామ్‌నాయక్, సీఐటీయూ గద్వాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, నరసింహ ఉన్నారు.

ప్రధానోపాధ్యాయుడి మృతి

గద్వాల క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా కేంద్రంలోని ఐడీఎస్ఎంటీ కాలనీలో నివాసం ఉంటున్న ప్రధానోపాధ్యాయుడు వడ్డెర హుస్సేన్(50) శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈయన కే.టి.దొడ్డిలోని ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్నారు. గురువారం రాత్రి ఇంట్లో భోజనం చేశాక, వాకింగ్‌కు వెళ్లారు. తిరిగి మొదటి అంతస్తులో ఉన్న ఇంటికి చేరుకుని, ఇంటిబయట ఉన్న కుర్చీలో కూర్చుని గుండె పోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడు హుస్సేన్‌కు భార్య రేణుక, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గ్రామాలకు బస్సు సర్వీసులు నడపాలి



గద్వాల ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం ఇస్తున్న బీజేవైఎం, బీజేపీ నాయకులు

గద్వాల అర్బన్/ మానవపాడు జూలై 25 (ఆంధ్రజ్యోతి): మానవపాడు మండలంలోని గ్రామాలకు గద్వాల డిపో నుంచి బస్సు సర్వీసులు కల్పించాలని శుక్రవారం గద్వాల డిపో మేనేజర్ సునీతకు బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌శర్మ, బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. మానవపాడు మీదుగా గతంలో గంటకు ఒక సర్వీసు చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు, అమరవాయి, పెద్దఆముదలపాడు, నారాయణపురం గ్రామాల మీదుగా ఉండేదని, ప్రస్తుతం ఉదయం, సాయంత్రం మినహా సర్వీసులు లేక ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. ఆయాగ్రామాల మీదుగా సర్వీసులు పెంచి ఏపీలోని కర్నూల్‌కు బస్సులు నడపాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో మురళీకృష్ణ, లక్ష్మీనారాయణ, రాఘవయ్య, మదన్ ఉన్నారు.

వ్యక్తిపై దాడి: కేసు నమోదు

అలంపూరు చౌరస్తా, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండలం పుల్లూరు శివారులోని అలంపూరు చౌరస్తా సమీపంలో క్యాతూరు గ్రామానికి చెందిన వెంకటేశ్ డాబా నిర్వహిస్తున్నాడు. శుక్రవారం డాబాలో ఉండగా అదేగ్రామానికి చెందిన శ్రీనువాసులు, ఆంజనేయులు వచ్చి తనపై దాడి చేశారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు చేశారని, ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

● రేషన్‌కార్డులు, వడ్డీలేని రుణాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్



నూతన రేషన్‌కార్డును లబ్ధిదారుకు ఇస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, కలెక్టర్ బీఎం సంతోష్

ధరూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలను అన్నిరంగాల్లో ఆర్థికంగా బలోపేతం చేయడంలో ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆ దిశగా వారి సర్వతోముఖాభివృద్ధికి వివిధ రకాల సంక్షేమ పథకాలు, వడ్డీలేని రుణాలు అందజేసి అండగా ఉంటుందన్నారు. శుక్రవారం ధరూరులోని ఇందిరా మహిళాశక్తి మిషన్- 2025 సంబురాల కార్యక్రమానికి ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్ బీ.ఎం.సంతోష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే, కలెక్టర్‌కు మహిళలు బతుకమ్మతో ఘనస్వాగతం పలికారు. బతుకమ్మ పాటలకు నృత్యాలు చేశారు. అనంతరం అర్హులైన నిరుపేదలకు రేషన్‌కార్డులను ఎమ్మెల్యే, కలెక్టర్ చేతులమీదుగా పంపిణీ చేశారు. మహిళా సంఘాలకు సంబంధించిన రుణాలను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలందరికీ ముందుగా శ్రావణమాసం శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఈ ప్రాంతంనుంచి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లేవారని, తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఈ మండలం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశానని అన్నారు. ప్రతీ గ్రామంలో మహిళలు సంఘాల ఏర్పాటు చేసుకుని వచ్చిన రుణాలతో చిన్నచిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు మహిళలకు కూడా ప్రాధానత్య కల్పిస్తూ వారిని ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. అందులో భాగంగా ఇందిరా మహిళాశక్తి ద్వారా మహిళలకు వడ్డీలేని రుణాలు అందించి కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా అండగా నిలిచిందన్నారు. మండలానికి 700 మంది అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణం ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురువ హనుమంతు, మాజీ జడ్పీ చైర్మన్ బండారి, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రమేష్‌నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, డీవై రామన్న, ఉరుకుందు, విజయ్ రెడ్డి, వీరన్నగౌడ్, శ్రీరాములు, భీమ్‌రెడ్డి, రంగస్వామి, దర్శల్లి, హనుమంతు, యువనాయకులు పురుషోత్తం రెడ్డి, కృష్ణారెడ్డి, నరేష్‌గౌడ్, మహిళా సంఘం నాయకులు ఉన్నారు.

వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి

- రూ.3కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం

- భూమిపూజలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ నాయకులు

గద్వాల, జూలై 25(ఆంధ్రజ్యోతి): గద్వాల వ్యవసాయ మార్కెట్‌ను అభివృద్ధి చేసి రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తానని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మార్కెట్ యార్డులో రూ.3 కోట్లతో నిర్మించే సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గద్వాల వ్యవసాయ మార్కెట్ ఉమ్మడి జిల్లాలో ప్రధాన మైనదని వివరించారు. వ్యవసాయ సాగు పెరిగి వివిధ పంటలకు నడిగడ్డ బింధువైందని రైతులకు మంచి ధర లభించే విధంగా అదేవిధంగా పంటల విక్రయానికి వచ్చే రైతులకు సౌకర్యాలు కల్పించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. మార్కెట్‌లో ఎప్పుడో వేసిన సీసీ రోడ్లు ధ్వంసమయ్యాయని, వాటిస్థానంలో కొత్తవాటిని నిర్మించడంతో పాటు వర్షంవస్తే నీళ్లు సులభంగా వెళ్లేందుకు డ్రైనేజీల నిర్మాణం అవసరం అని గుర్తించి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులు వచ్చేలోపే కాంట్రాక్టర్ త్వరగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా దడవాయి. హమాలీ, చాటకూలీలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ హనుమంతు, పీఏసీఎస్ అధ్యక్షుడు సుభాన్, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రమేశ్‌నాయుడు, మాజీ ఎంపీపీ విజయ్, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ బాబర్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

» జిల్లా సెక్టోరియల్ అధికారి హంపయ్య



మానవపాడు కేజీబీవీలో భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారి హంపయ్య

మానవపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారి హంపయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్, ఉన్నత పాఠశాల, భవిత కేంద్రం, కేజీబీవీ పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతీరోజు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కేజీబీవీలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం సరిగాలేదని మండిపడ్డారు. భోజనం తయారు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం స్కూల్ కాంపెక్స్ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శివప్రసాద్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ వీరేశ్, మున్ని ఉన్నారు.

ఇష్టంగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి

● డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా



సత్యమ్మను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గద్వాల టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తాము ఎంచుకున్న కోర్సులను ఇష్టంగా చదివి జీవితంలో ఉన్నత స్థానాలు దక్కించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా సూచించారు. స్థానిక మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం డిగ్రీ ప్రథమ సంవత్సరం లైఫ్ సైన్స్‌బీకామ్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా చార్టెడ్ అకౌంటెంట్ బలరాం బీకాం విద్యార్థులకు ఉండే అవకాశాలు, ఉపాధి రంగాలు, నేర్చుకోవాల్సిన అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చంద్రమోహన్, కామర్స్ హెచ్‌వోడీ వి.సురేందర్ రెడ్డి, లైఫ్ సైన్స్ హెచ్‌వోడీ డాక్టర్ వెంకటేశ్వరమ్మ, అధ్యాపకులు ఉన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు సన్మానం

గణిత విభాగం అధ్యాపకురాలు సత్యమ్మకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ కలందర్ బాషా, అధ్యాపకులతో కలిసి సత్యమ్మను అభినందించి, సన్మానించారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న షీటీం ఎస్సై తేజస్విని

గద్వాల, జూలై 25(ఆంధ్రజ్యోతి) విద్యార్థులు సోషల్ మీడియాకు ఎంతదూరంగా ఉంటే అంత మంచిదని షీటీం ఎస్సై తేజస్విని అన్నారు. శుక్రవారం మండలంలోని కొండపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షీ టీం నుంచి రక్షణ, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, పోక్సో, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు.అపరిచితుల ఫోన్‌కాల్స్ నమ్మవద్దని, దూరంగా ఉండాలని సూచించారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని చెప్పారు. చదువుకునే వయస్సులో చెడు అలవాట్లకు బానిసలుగా మారవద్దని సూచించారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై షీటీం సెల్ నెం 8712670312కు లేదంటే 100కు కాల్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేష్, ఉపాధ్యాయులు, షీటీం బృందం పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

అయిజ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భారత దేశ సనాతన ధర్మాన్ని ముందు తరాల వారికి అందిద్దామని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం అయిజ మండలంలోని యాపదిన్నెలో మురారి సోమశేఖర్‌రెడ్డి వారి బృందంచే సీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈకార్యక్రమములో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మీర్జాపూర్ వేంకటేశ్వర్‌రెడ్డి, గోసాయి హరి, కృష్ణ, లక్ష్మణ్‌గౌడు, వెంకటేశ్, గిడ్డయ్య, దాసులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

ఉండవల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చదువుతోపాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టిసారిస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డాక్టర్ హేమమాసన అన్నారు. తెలంగాణ ప్రభుత్వ మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీఎంఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం ఉండవల్లిలో విద్యార్థినులకు వైద్యశిబిరం నిర్వహించారు. మందులు అందజేశారు.

నీట్ ర్యాంకులు సాధించేలా కృషి చేయండి

అలంపూరుచౌరస్తా, జూలై25 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ విద్యార్థులు నీట్ ర్యాంకులు సాధించేలా సిద్ధం చేయాలని జీసీఈవో హంపయ్య అదేశించారు. శుక్రవారం ఆయన ఉండవల్లి మండలంలోని కలుగొట్లలో ఉన్న కేజీబీవీ పాఠశాల, కళాశాలను ఆయన సందర్శించారు. ఇంటర్ విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. నూతన మెనూ పాటించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.

రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

రాజోలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాజోలి శివారులోని తుంగభద్ర నది మధ్యలో కొలువుదీరిన రామలింగేశ్వర స్వామికి శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా శుక్రవారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శశికుమార్, సంజీవరెడ్డి, ఈసీ అంజి, మల్లేష్, విష్ణుప్రతాప్, జయన్నగౌడు పాల్గొన్నారు.

'జలదోపిడీని అడ్డుకుందాం'

గద్వాల టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అసమర్థత వల్ల ఆంధ్రా జలదోపిడీని అడ్డుకుందామని బీఆర్ఎస్వీ జిల్లా ఇన్‌చార్జి మాజ్ అన్నారు. అత్యంత విలువైన జలసంపదను పరిరక్షించడంలో నిర్లక్ష్యం చూపుతున్న సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీయాలని కోరారు. శుక్రవారం పట్టణంలోని ఎంఏఎల్‌డి ప్రభుత్వ డిగ్రీ, ఐటీఐ, పలుజూనియర్ కళాశాలల్లో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

తిర్మల్‌రెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం

» బాస్కెట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే విజయుడు

» ఉత్తనూర్‌లో అట్టహాసంగా రాష్ట్రస్థాయి పోటీలు



క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అయిజ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ దివంగత ఉత్తనూర్ తిర్మల్‌రెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అయిజ మండలంలోని ఉత్తనూర్‌లో శుక్రవారం రాష్ట్రస్థాయి మహిళ, పురుషుల బాస్కెట్‌బాల్ పోటీలను గౌతమ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే విజయుడు పాల్గొని మాట్లాడారు. తిర్మల్‌రెడ్డి ఎంపీపీ, జడ్పీటీసీగా ఉన్న సమయంలో ఏటా విద్యార్థులకు జిల్లాస్థాయిలో క్రీడలు నిర్వహించారని, బాస్కెట్‌బాల్ పోటీలను కొనసాగించటం ఆనందదాయకం అన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్రీడా జెండాను ఎగురవేసి క్రీడాజ్యోతి వెలిగించారు. క్రీడాకారులతో కలిసి పోటీలను ప్రారంభించారు. బాలికల విభాగంలో 14జట్లు, బాలుర విభాగంలో 18 జట్లు పాల్గొననున్నాయి. కార్యక్రమంలో తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, చైర్మన్ మక్సూద్‌బిన్ అహ్మద్‌జకీర్, ప్రధాన కార్యదర్శి పృథ్వీశ్వర్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు రాముడు, మునిసిపల్ వైస్‌చైర్మన్ నర్సింహులు, తిమ్మారెడ్డి, శివశంకర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి ఉన్నారు.

జిల్లాను రాష్ట్రస్థాయి టాప్10లో నిలపాలి

● ఇందిరమ్మ గృహాల నిర్మాణ విషయంలో చిత్తశుద్ధితో పనిచేయాలి

● అధికారులతో సమీక్ష సమావేశంలో కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ గృహాల నిర్మాణాలలో పురోగతి కనిపించేలా క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇందిరమ్మ గృహాల పురోగతిపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు ఏడువేల ఇందిరమ్మ గృహాలు మంజూరు కాగా ఇప్పటివరకు 543 గృహాలు మాత్రమే బేస్‌మెంట్ స్థాయికి చేరుకున్నాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల విషయంలో అలసత్వం వహించరాదని, క్రమంతప్పకుండా సమీక్ష నిర్వహిస్తూ నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేయాలని చెప్పారు. పురోగతి కనిపించకపోతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శ్రద్ధగా పనిచేసి జిల్లాను రాష్ట్రస్థాయి టాప్10లో నిలిపేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అలాగే వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో లక్ష్యం మేరకు సమష్టిగా మొక్కలు నాటాలన్నారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలను మునిసిపాలిటీ, గ్రామ పంచాయతీలలో మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రజలకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు, ఏడీ మైనింగ్ వెంకటరమణ. హౌసింగ్ పీడీ కాశీనాథ్, అధికారులు ఉన్నారు.

ప్రత్యేక మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలి



రైతు సంక్షేమ కమిటీ చైర్మన్‌ను కలిసిన సంపత్‌కుమార్

అయిజ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అలంపూర్ నియోజకవర్గంలోని అయిజకు ప్రత్యేక మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, కాంగ్రెస్ రాష్ట్రఅధికార ప్రతినిధి షెక్షావలిఆచారి కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిటీ చైర్మన్ కోదండరామిరెడ్డిని కలిశారు. స్పందించిన చైర్మన్, కొత్తగా వచ్చిన నిబంధనల ప్రకారం నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని చెప్పారు.

ఉద్యానవన పంటల సాగుతో అధిక లాభాలు



మునగాలలో ఉద్యానవన పంటలను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

ఇటిక్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన పంటల సాగుతో అధికలాభాలను పొందే వీలుంటుందని , రైతులందరూ పంట సాగుపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎంఏ అక్బర్ రైతులకు సూచించారు. శుక్రవారం మునగాల గ్రామంలోని రైతు మల్లేషు సాగు చేసిన కూరగాయల తోటను ఆయన పరిశీలించారు.

ఉద్యానవన పంటల ద్వారా నికర లాభాలు పొందవచ్చునని, రైతులు ఆయిల్‌ఫామ్ పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కూరగాయల సాగుకు ప్రభుత్వం రాయితీ అందుస్తుందని, కలుపు సమస్య లేకుండా నీటిని ఆదా చేసుకుంటూ ప్లాస్టిక్ మల్చింగ్ పథకానికి ప్రభుత్వం ద్వారా 50శాతం రాయితీ లభిస్తోందన్నారు. ఒక హెక్టారుకు రూ.20వేల చొప్పున రైతుకు అందిస్తామని, తీగ జాతి, బీర, కాకర, సోరకాయ సా గు చేసే రైతులకు శాశ్వత పందిళ్ల నిర్మాణానికి అర ఎకరానికి రూ.50వేల రాయితీ రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా ఇస్తామన్నారు. కార్యక్రమంలో డివిజనల్ అధికారులు రాజశేఖర్, ఇమ్రాన్, మహేశ్, రైతులు ఉన్నారు.

హెల్త్ ప్రొవైడర్ల సమస్యలు పరిష్కరించాలి

● ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు

గద్వాలటౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఎంఎల్‌హెచ్‌పీలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఆంజనేయులు, ఎంఎల్‌హెచ్‌పీలుగా విధులు నిర్వహిస్తున్న ఎంబీబీఎస్, ఆయుర్వేదిక్, హోమియో, యూనాని డిగ్రీ చేసిన వారికి దాదాపు రూ.40 నుంచి రూ.50 వేల వరకు వేతనాలు చెల్లిస్తున్న ప్రభు త్వం బీఎస్సీ, నర్సింగ్ డిగ్రీ చేసిన వారికి కేవలం రూ.29వేలు మాత్రమే చెల్లించడం సరికాదన్నారు. నియామక నోటిఫికేషన్ నిబంధన మేరకు ఫెర్ఫామెన్స్ బేస్డ్ ఇన్‌సెంటీవ్ రూ.15 వేలు చెల్లించాల్సి ఉన్నా ఇవ్వడంలేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పుప్రకారం సమానపనికి సమాన వేతనం చెల్లించాల్సిందేనన్నారు. దాంతోపాటే రూ.10 లక్షలవరకు హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్, పీఎఫ్, ఈఎస్ఐలు వర్తింపజేయాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రంగన్న, నాయకులు వెంకటేశ్, నరసింగరావు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీల జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా నందకుమార్, ప్రధాన కార్యదర్శిగా బి.రేణుక, ఉపాధ్యక్షులుగా హైమావతి, సుజాత, ఆర్గనై జింగ్ కార్యదర్శిగా శివతేజ, సహాయ కార్యదర్శు లుగా వెంకటేశ్వరి, శ్వేత, కోశాధికారిగా ఎం.శిరీష, మరో 11మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

రేపు గద్వాలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

గద్వాల, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు గద్వాలకు రానున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకం అయిన తర్వాత జిల్లాకు మొదటిసారి వస్తున్నారని తెలిపారు. ఆదివారం ఉదయం 9:30గంటలకు విలేకరుల సమావేశంలో మాట్లాడిన తర్వాత పది గంటలకు ఎస్వీ ఈవెంట్ హాల్‌లో మేధావుల సదస్సులో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి మేధావులు, విద్యావంతులు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి డీకే స్నిగ్ధారెడ్డి, మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వెంకట్రాములు, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ పాల్గొన్నారు.

బస్సు అదనపు సర్వీసు నడపాలి



నెట్టెంపాడు గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సును అడ్డగించి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

● ఆర్టీసీ బస్సు ముందు బైఠాయింపు

ధరూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరో అదనపు బస్సును నడపాలని ఏడు గ్రామాలకు చెందిన విద్యార్థులు నిరసన కోరారు. శుక్రవారం మండల పరిధిలోని ఉప్పేరుగ్రామంలో నెట్టెంపాడుకు వెళ్లే ఆర్టీసీ బస్సును ఉప్పేరు, నెట్టెంపాడు, త్యాగదొడ్డి, నాగర్‌దొడ్డి గ్రామాలకు చెందిన విద్యార్థులు అడ్డుకున్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా గంటపాటు ఆర్టీసీ బస్సు ముందు బైఠాయించారు. సుమారు ఏడు గ్రామాల విద్యార్థుల కోసం అదనంగా మరో బస్సును పాఠశాలల వేళలకు నడపాలని డిమాండ్ చేశారు. ఒకే బస్సులో విద్యార్థులంతా పాఠశాలలకు వెళ్లడం సాధ్యం కాదన్నారు. తక్షణమే డిపో మేనేజర్ స్పందించి బస్సులు నడపాలని, లేకుంటే గద్వాల జిల్లాకేంద్రంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ విషయాన్ని బస్సు డ్రైవర్ ఉన్నతాధికారులు సమాచారం అందించడంతో మరో బస్సును ఏర్పాటు చేస్తామని చెప్పడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.